క్లుప్తంగా

ఐటీఐ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

అనుమసముద్రంపేట(ఆత్మకూరు): ఏఎస్‌పేటలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐటీఐ)లో 2025–26 సంవత్సరంలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ ట్రేడ్ కోర్సుల్లో ప్రవేశానికి పదో తరగతి ఉత్తీర్ణులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ షేక్ గౌస్‌బాషా శుక్రవారం తెలిపారు. ఆసక్తి కలిగిన వారు జూలై 17వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని సమీప ఐటీఐ కళాశాలలో సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. జూలై 21న ఒరిజనల్ సర్టిఫికెట్లతో ఏఎస్‌పేట ఐటీఐకు హాజరుకావాలని కోరారు.

తహసీల్దార్‌కు సన్మానం



ఆత్మకూరురూరల్: మండల నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన పద్మజాకుమారిని వీఆర్ఏలు శుక్రవారం మర్యాదపూర్వంగా కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి క్షేత్ర స్థాయిలో వీఆర్ఏలు తమవంతు సహకారం అందించాలని కోరారు. వీఆర్ఏల సంఘ నాయకులు హజరత్తయ్య, ఖదీర్, అంకయ్య, నారాయణ పాల్గొన్నారు.

మలేరియాపై అవగాహన



ఉదయగిరి రూరల్: మలేరియాపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్‌యూనిట్ అధికారి షేక్ గాజుల నౌషాద్‌బాబు సూచించారు. ఉదయగిరిలోని బీసీ కాలనీ పాఠశాలలోని విద్యార్థులకు మలేరియా నివారణపై శుక్రవారం ఆయన అవగాహన కల్పించారు. దోమలతో మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, బోధకాలు వంటి వ్యాధులు వ్యాప్తి చెందుతాయని తెలిపారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వకుండా చూసుకోవడం ద్వారా దోమలను నివారించవచ్చని చెప్పారు. రాత్రి వేళల్లో దోమ తెరలను వాడడం ద్వారా వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని తెలిపారు. హెచ్ఎం నూర్జహాన్, ఉపాధ్యాయులు చెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



చేజర్ల(ఆత్మకూరు): చేజర్ల మండలం ఆదూరుపల్లిలోని ఎరువుల దుకాణాల్లో ఏఓ పీ హిమబిందు శుక్రవారం తనిఖీలు చేపట్టారు. రికార్డులను తనిఖీ చేసి స్టాక్‌ను పరిశీలించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన క్రమంలో రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగుమందులు అందుబాటులో ఉంచాలని సూచించారు.

నూతన కమిటీ ఎన్నిక

సంగం: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం మండల నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. సంగంలోని రాళ్లచెలిక పాఠశాలలో ఆంధ్రప్రదేశ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజగోపాలచారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండలాధ్యక్షుడిగా మెత్తుకూరు రవిబాబును ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొనసాగిన భక్తుల రద్దీ

దుత్తలూరు: నర్రవాడ వెంగమాంబ ఆలయంలో భక్తుల రద్దీ శుక్రవారం కూడా కొనసాగింది. గురువారంతో బ్రహ్మోత్సవాలు ముగిసినప్పటికీ అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో రద్దీ నెలకొంది. అర్చకులు వెంగమాంబ దంపతులను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

డీసీపల్లిలో 710 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం 710 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 947 బేళ్లు రాగా, 710 బేళ్లను విక్రయించామని చెప్పారు. వేలంలో కిలోపొగాకు గరిష్ఠంగా రూ.280, కనిష్ఠంగా రూ.160, సగటున రూ.210.45 ధర పలికినట్లుగా వివరించారు.

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం 432 బేళ్లను విక్రయించినట్లుగా వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు. వేలానికి జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 558 బేళ్లను తీసుకురాగా, 432 బేళ్లను విక్రయించామని చెప్పారు. వేలంలో కిలో పొగాకు గరిష్ఠంగా రూ.280, కనిష్ఠంగా రూ.170, సరాసరిన రూ.237.07 ధర పలికిందని వివరించారు. వేలంలో 16 కంపెనీలు పాల్గొన్నాయని తెలిపారు.

మోదీతోనే దేశప్రగతి

దుత్తలూరు: ప్రధాని నరేంద్రమోదీతోనే దేశ ప్రగతి సాధ్యమని బీజేపీ మండలాధ్యక్షుడు లెక్కల వెంగళరెడ్డి అన్నారు. నరేంద్రమోదీ 11ఏళ్ల పాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా మండలంలోని లక్ష్మీపురం, కమ్మవారిపాళెం, బ్రహ్మేశ్వరం గ్రామాల్లో కరపత్రాలు పంచుతూ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై శుక్రవారం వారు అవగాహన కల్పించారు. నాయకులు చుండి హరిగోపాల్‌రెడ్డి, పెసల కృష్ణ, అందె రామయ్య, శంకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గౌరవం లేదు..వేతనం రాదు

- ప్రభుత్వ కార్యక్రమాలకు ఆహ్వానాలు లేవు
- రెండేళ్లుగా అందని గౌరవవేతనాలు
- మండల సర్వసభ్య సమావేశాలకే పరిమితం
- కనీస గౌరవం ఇవ్వకపోవడంపై ఎంపీటీసీల ఆవేదన



జలదంకి మండల పరిషత్ కార్యాలయం

జలదంకి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజాప్రతినిధులకు గౌరవం, గౌరవవేతనాలు లేకుండా పోయాయి. ప్రజల చేత ఎన్నుకోబడిన మండల ప్రాదేశిక నియోజక వర్గాల సభ్యులు (ఎంపీటీసీ) పట్ల కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని చూపుతుందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గ్రామాల్లో తమకు ఏ పనులు చేయించలేని పరిస్థితి నెలకొందని, కనీసం తమకు గౌరవం కూడా లేకుండా పోయిందని, సుమారు 16 నెలలుగా గౌరవవేతనాలు కూడా అందడంలేదని పలువురు ఎంపీటీసీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 569 మంది ఎంపీటీసీలు ఉన్నారు. ఉదయగిరి నియోజకవర్గంలో 79 మంది ఉన్నారు. వీరికి ప్రతి నెలా రూ.3 వేలు చొప్పున గౌరవ వేతనం ఇవ్వాల్సి ఉంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రెండు విడతల్లో గౌరవవేతనాలు చెల్లించారు. సార్వత్రిక ఎన్నికలు రావడంతో మూడో విడత నిధులను మంజూరుచేసే అవకాశం లేకుండా పోయింది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావడంతో సంబరాలు చేసుకుంటోందని, కానీ తమ గురించి పట్టించుకోవడం లేదని ఎంపీటీసీలు విమర్శిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రెండు సార్లు బడ్జెట్ కేటాయింపులు జరిగాయి. ఎంపీటీసీల గౌరవవేతనాలకు బిల్లులు పెడుతున్నామని అధికారులు చెబుతున్నారే తప్ప, వారి ఖాతాల్లో నగదు జమకాలేదని వారు వాపోతున్నారు. ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులమైన తమకు అధికారులు ఏ మాత్రం గౌరవం ఇవ్వడం లేదని, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమల్లో టీడీపీ నాయకులకు ప్రాధాన్యం ఇస్తూ తమను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శిలాఫలకాల ఆవిష్కరణలో సైతం ప్రొటోకాల్‌ను పాటించడం లేదని ఆరోపిస్తున్నారు.

సర్వసభ్య సమావేశాలకే పరిమితం

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత సర్వసభ్య సమావేశాలకు హాజరుకావడమే తప్ప ప్రజల సమస్యలను పరిష్కరించాలని మండలాధికారుల దృష్టికి తీసుకొచ్చినా పట్టించుకున్న పాపాన పోవడం లేదని ఎంపీటీసీలు వాపోతున్నారు. కన్వీసం ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలకు కూడా తమను ఆహ్వానించడం లేదని చెబుతున్నారు. నిధుల మంజూరుపైన తమకు కనీసం సమాచారం ఇవ్వడం లేదని వాపోతున్నారు. ఇలా తమను వివక్షతకు గురిచేస్తున్నారని మండిపడుతున్నారు.

గౌరవవేతనం ఇవ్వడం లేదు



రెండేళ్లుగా గౌరవ వేతనాలు ఇవ్వడం లేదు. గతంలో ఎంపీటీసీలకు నిధులు కేటాయించేవారు. వాటితో అభివృద్ధి పనులు చేపట్టే వాళ్లం. ప్రస్తుతం అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు కూడా మంజూరు చేయడం లేదు. ఎంపీటీసీలను సర్వసభ్య సమావేశాలకే పరిమితం చేసి హోదా లేని టీడీపీ నాయకులకు అభివృద్ధి పనులు కేటాయిస్తుండడంతో వారు అందినకాడికి దోచుకుంటున్నారు.

– పసుపులేటి అమరావతి, ఎంపీటీసీ, చామదల

గౌరవం ఇవ్వడం లేదు



కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలకు విలువ ఇవ్వడం లేదు. ప్రజల చేత ఎన్నుకోబడిన తాము ప్రజలు అడిగే సమస్యలను పరిష్కరించాలని అధికారులను కోరినా పట్టించుకోవడం లేదు. మండల సమావేశాలకు కూడా సరిగా ఆహ్వానించడం లేదు. ఎంపీటీసీలకు కేటాయించే నిధులు ఆపేయడంతో ప్రజలకు సమాధానం చెప్పలేకపోతున్నాం.

– వీ లీలావతి: ఎంపీటీసీ, కృష్ణాపాడు

వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం



విశేషాలంకరణలో సీతారాములు

వరికుంటపాడు: మండలంలోని గువ్వాడిలో సీతారాముల ఉత్సవాల్లో భాగంగా సీతారాముల కల్యాణోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం ఉలసా నరసింహులు, రత్నమ్మ దంపతుల ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేశారు. రాత్రికి సీతారాముల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు.

117 కేంద్రాల్లో యోగా దినోత్సవం

సంగం: మండలంలోని 13 సచివాలయాల పరిధిలోని 117 కేంద్రాల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ షాలెట్ శుక్రవారం తెలిపారు. అందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని చెప్పారు. మండలాధికారులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

యథేచ్ఛగా గ్రావెల్ అక్రమ రవాణా



ట్రాక్టర్ల ద్వారా గ్రావెల్‌ను తరలిస్తున్న దృశ్యం



గ్రావెల్‌ను టిప్పర్లకు లోడ్ చేస్తున్న దృశ్యం

సోమశిల: అనంతసాగరం మండలంలోని ప్రభుత్వ భూముల నుంచి అనుమతి లేకుండా యథేచ్ఛగా గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్నారు. గత మూడ్రోజులుగా వడ్డిపాళెం తిప్ప నుంచి జేసీబీ, రెండు టిప్పర్ల సాయంతో గ్రావెల్‌ను అక్రమంగా తరలించి బెడుసుపల్లి కాలనీ సమీపంలో డంప్ చేస్తున్నారు. అక్కడి నుంచి ట్రాక్టర్ల ద్వారా రేవూరు, కొత్తపల్లి, మంచాలపల్లి తదితర గ్రామాలకు తోలుతున్నారు. ఇలా అనుమతులు లేకుండా విచ్చలవిడిగా గ్రావెల్‌ను తోలుతున్నా అధికారుల చూసీచూడనట్లుగా వ్యవహరించడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



మర్రిపాడు: మండలంలోని 89 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థులకు 4,819 నోట్ పుస్తకాలను ఆత్మకూరుకు చెందిన శ్రీసాంబశివ చారిటబుల్ ట్రస్టు అధినేత కంచి పరమేశ్వరరెడ్డి శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు, అనంతసాగరం మండలాలతో పాటు మర్రిపాడు మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభకనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కంచి పరమేశ్వరరెడ్డిని శాలువాతో సత్కరించి ఛత్రపతి శివాజీ చిత్రపటాన్ని బహూకరించారు. తహసీల్దార్ అనిల్‌కుమార్‌యాదవ్, సోమవరపు భాస్కర్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి, సురేంద్రరెడ్డి, రాజేంద్ర పాల్గొన్నారు.

హడలెత్తిస్తున్న గ్రామసింహాలు

- గతంలో యువకుడిపై దాడి
- తాజాగా ఆవు దూడపై దాడి
- చెవులు తినేయడంతో మృత్యువాతపడిన మూగజీవం



వీధి కుక్కల దాడిలో మృతి చెందిన లేగదూడ

సోమశిల : మండల కేంద్రమైన అనంతసాగరంలో గ్రామసింహాలు హడలెత్తిస్తున్నాయి. మూగ జీవాలతో పాటు మనుషులపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. నాలుగు నెలల క్రితం ఎస్సీ కాలనీకి చెందిన యువకుడిపై దాడి చేసి మర్మాంగాన్ని తీవ్రంగా గాయపరిచాయి. అలాగే పలువురిపై దాడి చేసి గాయపరిచాయి. జీవాలను సైతం చంపేశాయి. తాజాగా రెండ్రోజుల క్రితం దాబా సందులో ఓ ఆవు దూడపై కుక్కలు దాడి చేసి రెండు చెవులు పూర్తిగా తినేయడంతో మృత్యువాత పడింది. దీంతో ప్రజలు ఇంటి నుంచి ఒంటరిగా బయటకు రావాలంటే భయపడుతున్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులను వీధి కుక్కలు వెంబడించి తరుముతుండడంతో హడలిపోతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి వీధి కుక్కలను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఓటరు జాబితాలను పారదర్శకంగా రూపొందించాలి



మాట్లాడుతున్న ఎన్నికల అధికారి మురళి

ఉదయగిరి: ఓటరు జాబితాలను పారదర్శకంగా రూపొందించడంపై తహసీల్దార్లు ప్రత్యేక దృష్టి సారించాలని ఉదయగిరి నియోజకవర్గ ఎన్నికల అధికారి ఏ మురళి అన్నారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్లు, రాజకీయ పార్టీల నాయకులతో శుక్రవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలన్నారు. ఒక ప్రాంతంలో నివాసం ఉంటూ వేరే ప్రాంతంలో ఓటు కలిగివున్న వారిని గుర్తించి సరిచేయాలన్నారు. చనిపోయిన వారిని ఓటరు జాబితానుంచి తొలగించాలన్నారు. ఓటరు జాబితాలో చేర్పులు, మార్పులు చేసి పారదర్శకంగా రూపొందించాలన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్లు రామ్మోహన్, కృష్ణారెడ్డి, ఎస్డీ హుస్సేన్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

జాయింట్ పట్టా భూములకు సబ్ డివిజన్



మాట్లాడుతున్న ఏడీ నాగశేఖర్

జలదంకి: రీసర్వే పూర్తయిన గ్రామాల్లో జాయింట్ పట్టా భూములను సబ్ డివిజన్ చేస్తున్నట్లు సర్వే అండ్ ల్యాండ్స్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ నాగశేఖర్ తెలిపారు. శుక్రవారం ఆయన జలదంకి తహసీల్దార్ కార్యాలయంలో మండల సర్వేయర్ శోభన్‌బాబుతో కలిసి రీసర్వే చేసిన గ్రామాలు, జాయింట్ భూముల రైతుల వివరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాయింట్ పట్టా భూములుగా నమోదైన రైతులకు సంక్షేమ పథకాలైన తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలు పొందడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. దీంతో జేసీ కార్తీక్ ఆదేశాల మేరకు సబ్ డివిజన్ డ్రైవ్ చేపడుతున్నట్లు తెలిపారు. గతంలో సబ్ డివిజన్ నమోదుకు రూ. 550 చెల్లించాల్సి ఉండేదన్నారు. ప్రస్తుతం రైతులు స్థానిక సచివాలయంలో రూ.50 చెల్లిస్తే జాయింట్ పట్టా భూములను సబ్ డివిజన్ చేస్తారని వివరించారు. ఈ నెల 30వ తేదీ లోగా రైతులు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. తహసీల్దార్ ప్రమీల, డీఐఓసీ శ్రీనివాసరావు, సచివాలయ సర్వేయర్లు ఉన్నారు.

వైభవంగా సీతారాముల ఉత్సవాలు ప్రారంభం

ఉదయగిరి రూరల్: మండలంలోని సున్నంవారిచింతలలో సీతారాముల ఉత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు గణపతి పూజ, పుణ్యాహవచనం, కలశస్థాపన, నవగ్రహ మండపారాధన, సీతారాములకు పంచామృతాభిషేకాలు, విశేషాలంకరణలు, పూజలు నిర్వహించారు. సాయంత్రం సీతారాముల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు.

ఘనంగా సాయిబాబా మందిరం వార్షికోత్సవం



సంగం: వెంగారెడ్డిపాళెంలోని సాయిబాబా మందిరం ఆరో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ధర్మకర్త సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం విశేషాభిషేకాలు, పూజలు, హోమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

మండల సర్వసభ్య సమావేశం వాయిదా

ఉదయగిరి: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. మధ్యాహ్నం 12 గంటల వరకు వేచిచూసినా కోరానికి తగినంత మంది సభ్యులు హాజరుకాకపోవడంతో సర్వసభ సమావేశాన్ని వాయిదా వేసినట్లు ఎంపీడీఓ అప్పాజీ తెలిపారు.

ఉదయగిరి డిపోకు రూ.7లక్షల ఆదాయం

ఉదయగిరి రూరల్ : నర్రవాడ వెంగమాంబ తిరునాళ్లకు ప్రత్యేక సర్వీసులను నడపడం ద్వారా ఉదయగిరి డిపోకు రూ.6,96,295 ఆదాయం వచ్చిందని డిపో మేనేజరు శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. ఉదయగిరి, పోరుమామిళ్ల, బద్వేలు నుంచి నర్రవాడకు 22 ప్రత్యేక బస్సులను నడిపినట్లు తెలిపారు. ఈ బస్సులు 13,770 కి.మీ దూరం తిరిగాయని చెప్పారు. డిపోకు ఆదాయం తీసుకురావడానికి సహకరించిన ఆర్టీసీ సిబ్బందికి అభినందనలు తెలిపారు.

బావి ఆక్రమణపై ఫిర్యాదు

కావలి (జలదంకి): కావలి మండలం తాళ్లపాళెం పంచాయతీ పరిధిలోని రామచంద్రాపురంలో జనసేన నాయకుడు తిరుపతిస్వామి చేతిబోరును ధ్వంసం చేయడంతో పాటు మంచినీటి బావి స్థలాన్ని ఆక్రమించడంపై గ్రామస్తులు ఎంపీడీఓ శ్రీదేవికి శుక్రవారం ఫిర్యాదు చేశారు. గ్రామం నడిబొడ్డున చేతిబోరు, దాని పక్కనే మంచినీటి బావి ఉన్నాయన్నారు. గ్రామానికి చెందిన జనసేన నాయకుడు తిరుపతిస్వామి చేతిబోరును ధ్వంసం చేయడంతో పాటు బావిని జేసీబీ సాయంతో పూడ్చివేసి ఆక్రమించేందుకు యత్నిస్తున్నాడని విన్నవించారు. అధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించి ఆక్రమణలకు పాల్పడిన జనసేన నాయకుడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

నేడు యోగా దినోత్సవం

కావలి(జలదంకి): పట్టణంలోని మినీస్టేడియంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను శనివారం ఉదయం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అలాగే కావలి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం నిర్వహించే యోగా దినోత్సవ వేడుకల్లో కావలి ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి పాల్గొంటారని ఎంపీడీఓ శ్రీదేవి తెలిపారు. పట్టణ ప్రజలు, అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

సేవాభావంతో ప్రజలకు సేవలందించాలి



చేజర్లలో ప్రమాణం చేస్తున్న రెవెన్యూ ఉద్యోగులు



ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయంలో విశ్రాంత రెవెన్యూ ఉద్యోగులకు సత్కారం



వింజమూరులో కేక్ కట్‌చేస్తున్న తహసీల్దార్

ఆత్మకూరు: రెవెన్యూ ఉద్యోగులు బాధ్యతగా విధులు నిర్వర్తిస్తూ సేవాభావంతో ప్రజలకు సేవలందించాలని ఆత్మకూరు ఆర్డీఓ బీ పావని అన్నారు. ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయంలో రెవెన్యూ డేను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆత్మకూరు తహసీల్దార్ బీ పద్మజాకుమారి, డీటీ స్వరూప్‌తో పాటు తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు. భారీ కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. అనంతరం విశ్రాంత డీటీ పెంచలయ్య, విశ్రాంత వీఆర్వో శేషగిరిరావును ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. విశ్రాంత ఉద్యోగులు ఇరువురు తమ అనుభవాలను వివరించారు. అలాగే చేజర్ల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బీ మురళి ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహిస్తామని, సేవా భావంతో పనిచేస్తామని ప్రమాణం చేశారు. అనుమసముద్రంపేట తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కే అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. అనంతరం విధుల్లో అంకితభావంతో పనిచేస్తామని ప్రమాణం చేశారు.

మర్రిపాడు: మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ అనిల్‌కుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో రెవెన్యూ డేను ఘనంగా నిర్వహించారు. ఆర్ఐ సాయి కిరణ్, ఏఎస్సై నజీర్, ఏఎంసీ చైర్మన్ ఆరికట్ల జనార్దన్ నాయుడు, మాజీ ఎంపీపీ శాఖమూరి నారాయణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉదయగిరి: మండల తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయగిరి నియోజకవర్గ ఎన్నికల అధికారి కే మురళి పాల్గొని మాట్లాడుతూ ప్రజాపాలనలో రెవెన్యూ శాఖ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. అనంతరం రెవెన్యూ సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎల్ రామ్మోహన్, రెవెన్యూ సిబ్బంది, డీలర్లు పాల్గొన్నారు. అలాగే వింజమూరు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎంఎం హమీద్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు.

దుత్తలూరు: మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ యనమల నాగరాజు ఆధ్వర్యంలో రెవెన్యూ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో ఉన్న వివిధ రికార్డులపై అవగాహన కల్పించారు. అనంతరం తహసీల్దార్‌ను రెవెన్యూ సిబ్బంది, రేషన్‌డీలర్లు శాలువాలతో సన్మానించారు.

దగదర్తి: మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పీ కృష్ణ ఆధ్వర్యంలో విశ్రాంత డీటీ వెంకటరత్నం, విశ్రాంత వీఆర్వోలు శేషగిరిరావు, రామలింగయ్యను శాలువాలతో సత్కరించారు. డీటీ బాలాసింగ్, ఆర్ఐ శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ చిన్నారులకు కిట్ల అందజేత



ఆత్మకూరు: దివ్యాంగ చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన భవిత కేంద్రాలపై తల్లిదండ్రులు అవగాహన పెంచుకోవాలని ఎంఈఓ అనంతలక్ష్మి అన్నారు. పట్టణంలోని వెస్ట్ పాఠశాలలోని భవిత కేంద్రంలోని చిన్నారులకు కిట్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ఎస్ఎస్ఏ ద్వారా భవిత కేంద్రాల్లో దివ్యాంగ చిన్నారులకు ప్రత్యేక సౌకర్యాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. ఫిజియోథెరపి సేవలను అందిస్తున్నారని వివరించారు. ఆర్‌పీలు కాటంగారి పద్మ, అళ్ల జయకుమార్ పాల్గొన్నారు.

వింజమూరు పంచాయతీ కార్యదర్శిగా కే రామారావు



వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మేజర్ పంచాయతీ కార్యదర్శిగా కొప్పోలు రామారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ప్రకాశం జిల్లా శింగరాయకొండ మండలం మూలగుంటపాడు పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వింజమూరు పంచాయతీని ప్రగతి పథంలో నిలిపేందుకు కృషి చేస్తామన్నారు.

ఆటపాటలతో విద్యా బోధన

సీతారామపురం : అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యాబోధనను అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ షాను అంగన్‌వాడీలకు సూచించారు. మండలంలోని పోలంగారిపల్లి, రంగనాయుడుపల్లి అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. రికార్డులను తనిఖీ చేసి సిబ్బందికి సూచనలు చేశారు. ప్రీ స్కూల్ కార్యకలాపాలు పిల్లల సమగ్ర అభివృద్ధికి దోహదపడేలా ఉండాలన్నారు. పీపీ–1,2 పుస్తకాలతో విద్యాబోధన చేస్తూ ఆటపాటలు, కథలు, బొమ్మలు గీయడం, చేతి పనులు, తదితర అభ్యసనా కార్యకలాపాలు చేయించాలన్నారు. అంగన్‌వాడీలు సులోచన, సంపూర్ణ, కళావతి పాల్గొన్నారు.

చెరువులను వదలడం లేదు



జలదంకి పెద్దచెరువులో మట్టి తవ్వకాలతో ఏర్పడిన భారీ గుంతలు

జలదంకి: జలదంకి మండలంలో మట్టి అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. జలదంకి, రామవరప్పాడు, గట్టుపల్లి చెరువుల నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. రైతు పేరిట పర్మిషన్ తీసుకుని రాత్రి వేళల్లో జేసీబీలు పెట్టి పెద్ద ఎత్తున ట్రాక్టర్లలో ఇటుకబట్టీలు, లేఅవుట్లకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. చెరువుల్లో లోతుగా తవ్వకాలు సాగిస్తుండడంతో వర్షాకాలంలో నీరు నిల్వ ఉండి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మట్టి అక్రమ రవాణా పెద్ద ఎత్తున జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మట్టి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

డ్రైనేజీలు నిర్మించాలని వినతి



సోమశిల: అనంతసాగరంలోని బీసీ కాలనీకి వెళ్లే రోడ్డులో కెనరా బ్యాంకు వద్ద వర్షపు నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి అన్వర్‌బాషా కోరారు. ఈ మేరకు సీపీఎం ఆధ్వర్యంలో అనంతసాగరం ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్‌కు శుక్రవారం వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ కాలనీలో బ్యాంకు, రెండు ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. బీసీకాలనీలో డ్రైనేజీలు లేని కారణంగా వర్షపు నీరు నిల్వ ఉంటూ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని విన్నవించారు. సిమెంట్‌రోడ్డు సైతం దెబ్బతిని గుంతలు ఏర్పడుతున్నాయని తెలిపారు. డ్రైనేజీ సమస్యను త్వరగా పరిష్కరించాలని కోరారు. మండల కమిటీ సభ్యులు డాక్టర్ సుబ్బారాయుడు, జక్రయ్య, మీరామొహిద్దీన్, మెడతాటి నరసింహులు పాల్గొన్నారు.